www.prajasakti.com
సోమవారం 22 జులై 2024
5
వైఎస్ఆర్



కడప 'ఉక్కు'కు నిధులు కేటాయించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ పార్లమెంటు సమావేశాలలో ఈసారైనా కడప ఉక్కుకు నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ ప్రకటనలో తెలిపారు. పదేళ్లల్లో విభజన హామీ అయిన కడప ఉక్కును కేంద్రం పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. కరువు, వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కావాలంటే కడప ఉక్కు పరిశ్రమ ఏకైక మార్గమని తెలిపారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదని పేర్కొన్నారు. ఇప్పుడు కడప ఉక్కు కు నిధులు రాబట్టే సమయం వచ్చిందని తెలిపారు. కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక భాద్యతలులో ఉందని, కూటమి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కు పై ప్రస్తావించి నిధులు రాబట్టాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం శిలా ఫలకాలు మార్చడానికి, శంకుస్థాపనలు చేసి కాలయాపన చేసిండానికి ఈ ప్రాంత ప్రజలు గత ఎన్నికలలో ఇచ్చిన తీర్పే నిదర్శనమని తెలిపారు.

గళం విప్పేనా?



ఉక్కు నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థాపన చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ (ఫైల్‌ఫొటో)

- 'ఉక్కు' సంకల్పాన్ని ప్రదర్శించాలి
- నత్తనడకన ఎత్తిపోతల పథకాలు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

ప్రజాశక్తి-కడపప్రతినిధి

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న సామెత చందంగా మారిన నేపథ్యంలో శాసనసభ, పార్లమెంట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఉరుముతోంది. రాష్ట్ర విభజన చట్టంలో ఆర్నెళ్లలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ తొలి సమావేశాల్లో ఒక్కో జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించారు. పదేళ్ల వ్యవధిలో పాలక పార్టీలైన టిడిపి, వైసిపి ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఎటువంటి పురోగతీ లేకపోవడం ఆందోళన కలిగించింది. రాయలసీమకు గుండెకాయ గండికోట సాగునీటి ప్రాజెక్టు ఇటు వంటి ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటరీలు లేకపోవడంతో అలం కార ప్రాయంగా దర్శనమిస్తోంది. దీనికితోడు గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం వీడలేదు. వెలిగల్లు రిజర్వాయర్‌కు డిస్ట్రిబ్యూటరీలు చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తి పోతల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. కడప సూపర్‌స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరికరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియడంలేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నేటి నుంచి శాసనసభ, పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేప థ్యంలో జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాకు చెందిన పాలక, ప్రతి పక్ష పార్టీల ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

రాష్ట్ర శాసనసభ, పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధ మైంది. ఈమేరకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానులకు చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు పార్లమెంట్ స్థానాలను వైసిపి, రెండు శాసనసభ స్థానాలు మినహా మిగిలిన 11 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన తొమ్మిది స్థానాల్ని టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధి బాధ్యత అధికార, ప్రతి పక్షాల బుజాలపై పడింది. జిల్లాలో కూటమి పార్టీలు పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత వాటిపై ఉంది. 2017 నవంబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. మూడేళ్ల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించి, రాష్ట్రవాటాను జత పరిచి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించాలి.

గండికోటకు డిస్ట్రిబ్యూటరీలేవీ..?

రాయలసీమ జిల్లాలకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. గత మూడేళ్లుగా గండికోట ప్రాజెక్టును 26.86 టిఎంసిలతో నింపు తున్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ సాగుతూనే ఉంది. 1994 నుంచి 23 గ్రామాల వారికి పునరావాస సదుపాయం కల్పన సాగుతూనే ఉంది. గాలేరు-నగరి ఫేజ్ - 2 పనులకు గ్రహణం తొలగడం లేదు.

కడపలో ఫుడ్‌పార్కు గతేమిటో?

కడపలో రూ.12 కోట్లతో ఫుడ్ పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్‌పార్క్ కాగితాలకే పరిమితమంది. ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది.

అపెరల్ పార్కు ఎప్పుడో?

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డు సమీపంలో 76. 17 ఎకరాలను 47 ప్లాట్లుగా విభజించిన సంగతి తెలిసిందే. రూ.55 కోట్లతో అపెరల్ పార్కు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో చేనేతలు ఉన్న సంగతి తెలిసిందే.

ఏదీ టెక్స్‌టైల్ పార్కు?

2005-06లో మాజీ సిఎం కీ.శే వైఎస్ఆర్ మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరాలను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనులు చేపట్టారు. రూ. 2.8 కోట్ల వ్యయం చేసినట్లు సమాచారం. అనంతరం ఎటువంటి పురోగతి కనిపించడం లేదు.

ఎపి కార్ల్‌కు నిధులపై అయోమయం

పులివెందుల సమీపంలో రూ.396 కోట్లతో 644 ఎకరాల్లో అంతర్జాతీయ పశు పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎపి కార్ల్‌లో రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. గత బడ్జెట్‌లో పరి శోధనలకు అరకొర నిధులు కేటాయించారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశువుల పిండాలను సంకరీ కరణ ద్వారా వాతా వర ణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృష్టించ డానికి చర్యలు తీసుకున్నారు. దానికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది.

వైవీయూలో నిర్మాణ పనులు

యోగివేమనయూనివర్శిటీపై చిన్న చూపు కొనసాగుతోంది. 2008లో రూ.100 కోట్ల వ్యయంతో యూనివర్శిటీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాంలో పీజి సెంటర్ యోగి వేమన యూని వర్శిటీగా మార్చి పెద్దఎత్తున నిధులు కేటాయిం చారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన యూనివర్శిటీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆర్ట్స్‌తోపాటు పలు విభాగాలకు చెందిన భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది.

ఏదీ హార్టీకల్చర్ యూనివర్శిటీ

రాజంపేటలో హార్టీకల్చర్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని హామీ నీరు గారిపోయింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. టిడిపి హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన మేడా నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీకల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించారు. ఈమేరకు ప్రభుత్వ అధినేత నుంచి హామీ సైతం పొందారు. అనంతరం దీని గురించి మరిచిపోయారని తెలుస్తోంది.

గండికోట గ్రేటర్ కాన్యనేనా?

గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ కాన్యన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదం గొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చి దిద్దుతామని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి హయాంలో మంత్రులు హడావుడి చేశారు. గండికోటలో స్కైవాచ్ సదుపాయం కల్పిస్తానని హామీనిచ్చారు. రూ.10 కోట్లతో రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశాల వరకు పరిమితమయ్యారు. జిల్లాలో అసంపూర్తిగా, అమలుకు నోచుకోని అంశా లపై జిల్లా ప్రజాప్రతినిధులు చర్చకు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధిపథంలోకి నడిపిం చాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రాధాన్యత

- బ్రహ్మసాగర్ గేట్లకు మరమ్మతులు
- కుందూ-పెన్నా ఎత్తిపోతలతో స్థిరీకరణ
- తెలుగుగంగ ప్రాజెక్ట్స్ ఎస్ఇ డి.వెంకటరామయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



బ్రహ్మసాగర్ ఎత్తిపోతల పనులు వేగవంతం చేస్తాం. రూ.46 కోట్లతో బ్రహ్మంసాగర్ కెనాల్ గేట్ల మరమ్మతులు, ఎత్తిపోతల పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. దీంతో 1.56 లక్షల పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ఇందులోభాగంగా కుడి, ఎడమ కాల్వల పనుల్ని వేగవంతం చేశాం. ఎడమ కాల్వ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ఇందుకుగానూ జిబిఒ, ఒబిసి పనుల్లో కదలిక నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నంద్యాల-కడప జిల్లా సరిహద్దు ప్రాంతంలోని 98 కి.మీ నుంచి 108 కి.మీ వరకు కాల్వల పనుల్ని పూర్తి చేస్తే పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్స్ ఎస్ఇ డి.వెంకటరామయ్యతో ముఖాముఖీ...

టిజిపి ప్రాజెక్టుల మరమ్మతులపై మాట్లాడండి?

తెలుగుగంగ ప్రాజెక్టుల పరిధిలోని బ్రహ్మంసాగర్, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు చేపట్టాం. ఇటీవల రూ.10 లక్షలతో తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులు చేశాం. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించడమైంది. వీటితోపాటు కడప జిల్లాలోని పలు చెరువులకు కట్టలు, తూముల గేట్లకు మరమ్మతులు చేయడమైంది.

సర్‌ప్లస్ గేట్ ఏర్పాటు ఎప్పుడు?

బ్రహ్మంసాగర్ సర్‌ప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభించాల్సి ఉంది.

సాగర్ నిల్వ సామర్థ్యం ఎంత?

17 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 2.08 టిఎంసిలు నిల్వ ఉంది. కుందూ-పెన్నా ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఆయకట్టు పూర్తి స్థాయిలో స్థిరీకరణకు అవకాశం ఉంటుంది.

కెనాల్ లీకేజీ గురించి చెప్పండి?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల నుంచి నీరు లీకేజీ కొనసాగుతోంది. ఒక కెనాల్ గేజ్‌లకు మరమ్మతులకు గురికావడం, మరో కెనాల్‌లో డ్రమ్స్‌ల సర్దుబాటులో స్తబ్ధత కారణంగా లీకేజీ కొనసాగుతోంది. దీనిపై నాలుగుసార్లు టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇటీవల తాత్కాలికంగా ఎల్ఎస్‌పి కాంట్రాక్టర్‌తో కదిలించే ప్రక్రియ చేపట్టాం.

సాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల విస్తీర్ణం ఉంది. ఇందులో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన ఆయకట్టు ఎస్ ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది. ఇందులో జిబిసి, ఓబిసి కెనాల్ ప్రాంతాల్లో పెండింగ్ పనుల్ని పూర్తి చేయ డంపై ఆధారపడి ఉంది.

సాగర్ ఆయకట్టు వివరాలు తెలపండి?

ముఖా ముఖి..

బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో బ్రహ్మంసాగర్ ఆయకట్టు విస్తరించి ఉంది. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బద్వేల్ నియోజక వర్గంలోని బద్వేల్, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండ లాలున్నాయి.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల్లోని జిబిసి, ఒబిసి ప్రాంతాల్లోని అక్కడక్కడా ఉన్న పెండింగ్ పనులు వేగవంతం చేశాం. ఇందులో భాగంగా ఒబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. జిబిసి కాంట్రాక్టర్ ముందుకెస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రాంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతం పురోగతి కొనసాగుతోంది. నాలుగు దఫాలుగా పిలిచిన టెండర్లలో జెకె కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుని పనులు చేపడుతోంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. 700 మీటర్ల అక్విడక్టు పనులు చేపడితే అట్లూరు మండల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు ఎంతవరకు వచ్చింది?

బ్రహ్మంసాగర్ లీకేజీ పనులకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది.

కుందూ-పెన్నా లిఫ్టు పనుల గురించి చెప్పండి?

కుందూ-పెన్నా ఎత్తిపోతల పనుల్లో స్తబ్ధత నెలకొంది. 56 ఎక రాల భూసేకరణ తరుఆవత లిఫ్టు పనులను పూర్తి చేసి ఎని మిది టిఎంసిలను ఎత్తిపోసే అవకాశం ఉంది.

జిల్లాలో భూకబ్జాలపై విచారణ చేపట్టాలి

అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న బి. నారాయణ

జిల్లాలో భూకబ్జాలపై వెంటనే విచారణ చేపట్టాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ 10 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములను పాలకవర్గ పార్టీలైన వైసిపి, టిడిపిలోని ప్రజాప్రతినిధులు, బంధువులు, రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు, హైదరాబాద్, బెంగళూరు, గుంటూరు, కర్నూల్, ప్రకాశం జిల్లాలకు చెందిన డబ్బున్న వ్యక్తులు రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రమేయంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేశారని తెలిపారు. లక్షా 50 వేల ఎకరాలు జిల్లాలో అన్యాక్రాంతమైందని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి రెండు ప్రభుత్వాలు ఇప్పటికే పాలించాయని, వీరి పరిపాలనలో భూకబ్జాలు పెట్రేగిపోయాయని తెలిపారు. ఒంటిమిట్ట మండలం జోకుల పల్లె రెవెన్యూ పొలంలో 3000 ఎకరాలు, పెన్నా పేరూరు రెవెన్యూ పొలం సర్వేనంబర్ 661 లో వందల ఎకరాలు భూములు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. కాశినాయన మండలం అక్కింగుండ్ల రెవెన్యూ పొలంలో 2017 సంవత్సరం అప్పటి కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశాల మేరకు 6 మంది తహశీల్దార్లు, ఆర్‌డిఒ విచారించిన భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినప్పటికీ ఇంతవరకు చేసుకోలేదన్నారు. బద్వేల్, గోపవరం రెండు మండలాలలో చాలా విలువైన ప్రభుత్వ భూములు 500 ఎకరాలు, వందల కోట్ల రూపాయలు విలువ చేసే భూములు పలుకుబడి కలిగిన వారు ఆక్రమించుకున్నారన్నారు. వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బద్వేల్‌లో దొంగ పట్టాలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేశారని తెలిపారు జెడ్‌హెచ్‌డిసి సొసైటీ ద్వారా దళితులు బద్వేల్, గోపవరం, అట్లూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ఖాజీపేట మండలాలలో సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ పట్టాలి ఇవ్వలేదన్నారు. సికె దీన్నే మండలం, కడప నగర పరిధిలో పుట్లంపల్లి, రిమ్స్ పరిసర ప్రాంతాలు, బుద్ధ టౌన్‌షిప్, భావన టౌన్షిప్ ప్రభుత్వ భూములలో లేఅవుట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టిడిపి మండల నాయకులు కూడా గ్రామాలలో తమ ప్రభుత్వం వచ్చింది కాబట్టి భూ ములు దున్నుకుంటామని బ్రహ్మంగారిమఠం, బద్వేల్, మైదుకూరు, ఒంటిమిట్ట మండలాలలో దౌర్జన్యం అన్యాయానికి పాల్పడుతున్నారని తెలిపారు. అన్యాక్రాంతమైన భూముల వివరాలు భూకబ్జా దార్ల పేర్లతో కూడిన కరపత్రాలు వేస్తామన్నారు. సమావేశంలో జిల్లా భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ బి. నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, బిఎస్పి జిల్లా నాయకులు గుర్రప్ప మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీ ఖాన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ఆర్. వి. ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి మునయ్య, దళిత ఫోరం జిల్లా నాయకులు కిషోర్, రాజేష్ రావు, రిపబ్లిక్ పార్టీ నాయకులు నరసింహ, లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు దేవర కృష్ణ, జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోనేటి నరసయ్య, సహాయ కార్యదర్శి సురేష్ బాబు, బి కె ఎం యు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, రసూల్ పాల్గొన్నారు.

ఉద్యమ సంఘానికి ఊతమివ్వండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పరమావధిగా 1974, ఆగస్టు 10వ తేదీన ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50 వసంతాలు పూర్తిచేసుకుని డిసెంబర్‌లో 4 రోజులపాటు విద్యా వైజ్ఞానిక సదస్సులతో కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తుందని, వాటిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం యుటిఎఫ్ భవన్‌లో మహాసభల కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటియఫ్ ప్రభుత్వ విద్యా రంగబలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తుందని చెప్పారు. సిపిఎస్ రద్దు విషయంలోనూ, జీవో నంబర్ 117 రద్దు కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అదే ఉద్యమ స్ఫూర్తితో పని చేస్తుందని తెలిపారు. స్వర్ణోత్సవాల సందర్భంగా 50 సంవత్సరాలలో ఉపాధ్యాయ, విద్యారంగానికి యుటిఎఫ్ చేసిన కృషిని ఆత్మావలోకనం వేసుకుంటూ మరో 50 సంవత్సరాల పాటు ఉద్యమ స్ఫూర్తిని ఉపాధ్యాయుల్లో నింపడానికి ఈ మహా సభల ద్వారా కృషి చేస్తామని చెప్పారు. చారిత్రాత్మక అవసరంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయడంలో ప్రతి ఉపాధ్యాయుని భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో విరాళాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు మహాసభల జయప్రదం కోసం తమ వంతు భాగస్వామ్యం ఉండేలా ప్రతి ఒక్కరూ ఆర్థికంగా విరివిగా విరాళాలు అందించి ఉద్యమ సంఘానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, బత్తుల చంద్ర శేఖర్, గోపీనాథ్, కృష్ణారెడ్డి, పోతురాజు చంద్రశేఖర్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - బద్వేలు : డిఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేల్ గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిద్ధవటం రోడ్డులోని బిసి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 18,19 తేదీలలో కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యంలో పూర్వ ఆర్జెడి వై రాఘవరెడ్డిపై విచారణలో పాల్గొన్న బాధిత ఉపా ధ్యాయుల్లో ఒకరైన వెలుగోటి వెంకటేశ్వర్లు అనే ఉపాధ్యాయుడిని విచారణలో పాల్గొన కుండా అడ్డుకొని భౌతిక దాడులకు పాల్పడ్డం దారుణమని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటివారు ఉపాధ్యాయ వృత్తికే పెద్ద మాయని మచ్చ అని తెలియజేశారు. దాడులకు పాల్పడిన వారికి, మూలకారకులు పూర్వ ఆర్జెడి రాఘవరెడ్డి పై శాఖా పరమైన చర్యలతో పాటు తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంకెబిఎన్ ఆర్ సాగర్, బిసిఇఎఫ్ జిల్లా కన్వీనర్ కావేటి. రమేష్ యాదవ్, సామాజిక న్యాయ సమితి కన్వీనర్ శివరామయ్య, టిడిపి బిసి నాయకులు మాజీ సర్పంచ్ వెంకట రమణయ్యయాదవ్, బిసిఇఎఫ్ బద్వేలు అధ్యక్షులు మురళీకృష్ణ, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న అండర్-19 క్రికెట్ టోర్నీ

- 36 పరుగుల తేడాతో నార్త్ జోన్ విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ -19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు పై 36 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 48.1 ఓవర్లలో 205 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎ.ఎన్. వి. లోహిత్ 42 పరుగులు చేశాడు. అనంతరం 206 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 41.5 ఓవర్లలో 169 పరుగులకు ఓటమి చెందింది. **కడపపై సెంట్రల్ జోన్ విజయం..** కెఒఆర్ఎంఎ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప జట్టుపై 4 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 37.0 ఓవర్లలో 221 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కె. ఆనంద్ 36 పరుగులు చేశాడు. అనంతరం 222 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఏ. ఎస్. సాయి చేతన్ రెడ్డి 64 (నాటౌట్) పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని మెహబూబ్ 2 వికెట్లు తీసుకున్నాడు. **167 పరుగుల తేడాతో విశాఖపట్నం విజయం** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై 167 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం. యువన్ అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించాడు. 105 బంతులను ఎదుర్కొని 19 బౌండరీలు, 6 సిక్సర్ల సహాయంతో 152 పరుగులు (సెంచరీ) చేశాడు. కృష్ణ జట్టులోని బి. గీత్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 323 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కృష్ణా జట్టు 41.2 ఓవర్లలో 155 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది.

ఎస్ఐ దురుసుగా ప్రవర్తించడం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వాహనాల తనిఖీలో భాగంగా ఎస్ఐ దురుసు ప్రవర్తన వల్ల ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి నవదీప్ గాయపడ్డాడని మానవ హక్కుల విభాగం నాయకులు సుంకేసుల బాదుల్లా అన్నారు. ఆదివారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నవదీప్‌ను పరామర్శించారు. బైక్ పైన వస్తుండగా వెహికల్ చెకింగ్ చేస్తున్న ఎస్ఐని చూసి విద్యార్థి భయభ్రాంతులకు గురయ్యారని చెప్పారు. వెనుతిరిగి వెళుతున్న విద్యార్థిని వెంబడించి పట్టుకుని తన దురుసు ప్రవర్తనతో గాయపరచారని పేర్కొన్నారు. మానవ హక్కులను ఉల్లంఘన చేసిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, జనరల్ సెక్రెటరీ ఆర్.సిద్దయ్య, ఎం.బీ.సీ ఉపాధ్యక్షుడు శివయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బద్వేలు : బద్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా స్వచ్ఛభారత్, గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతానాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో, స్వచ్ఛభారత్ గ్రామ పంచాయతీ కార్మికులు తాతల ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రంగా తీర్చిదిద్దరంలో వీరి పాత్ర కీలకమని తెలిపారు. వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరికి ఎనిమిది నెలలు, మరికొందరికి పది నెలలు, ఇంకొందరికి 12 నెలలు అయినప్పటికీ వేతనాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. కానీ వారు మాత్రం పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ జిల్లా అధికారులు వెంటనే స్పందించి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో - కన్వీనర్ పిసి కొండయ్య, సిఐటియు నాయకులు ముడియం చిన్ని, గంగనపల్లి నాగార్జున, గంప సుబ్బరాయుడు ,వి సుబ్బరాయుడు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్, గ్రామపంచాయతీ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతానాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్, గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా కన్వీనర్ కె. సత్యనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ జిల్లా అధికారులు వెంటనే స్పందించి జీతాలు ఇవ్వాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 22న (సోమవారం) డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవలసినదిగా కలెక్టర్ పేర్కొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

ప్రజాశక్తి కడప అర్బన్

సమాజంలో మహిళల పాత్ర కీలకమని బయో టెక్నాలజీ లెక్చరర్ డాక్టర్ పి.కల్పన అన్నారు. ఆదివారం బాలాజీనగర్‌లోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక సమత మహిళా విభాగం ఆధ్వర్యంలో 'మహిళలు సైన్సు- శాస్త్రీయ దృక్పథం' అనే అంశంపై మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో లోపించిన శాస్త్రీయ దృక్పథాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంతో క్షుణ్ణంగా విశదీకరించారు. సమాజంలో ప్రధాన పాత్ర వహించే మహిళల వ్యక్తిగత, కుటుంబ పరమైన సమస్యలతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. డాక్టర్ ప్రమోద మాట్లాడుతూ బాల్య దశ నుంచే మూఢత్వంతో ఉన్న మహిళల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విశ్లేషించారు. సైక్రియాటిస్ట్ ప్రొఫెసర్ సునీత మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఉన్న మూఢనమ్మకాల గురించి, మహిళల్లో ఉన్న మానసిక జబ్బుల గురించి, అవి రావడానికి కారణాల గురించి వివరించారు. ప్రజల్లోని మూఢ నమ్మకాలను ఉపయోగించుకుని మంత్ర తంత్రా తో జరిగే మోసాలను తమ మ్యాజిక్ ద్వారా బాల బయన్న, వెంకటేశ్వర్లు వాటి గుట్టు విప్పి చెబుతూ పిల్లల ద్వారానే చేయించారు. ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళ గొప్పతనం గురించి తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సమతా మహిళా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, విద్యార్థినీ విద్యార్థులు, మేధావులు, 200 మంది సమత సభ్యులు పాల్గొన్నారు.



మ్యాజిక్ ద్వారా మంత్ర తంత్రాలను తెలియజేస్తున్న సమతా విభాగం నాయకులు, మాట్లాడుతున్న లెక్చరర్


ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

చెన్నారెడ్డిపల్లెలో నీటి కష్టాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య ఏరక్పడింది. నీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల క్రితం గ్రామానికి నీరు సరఫరా చేసే విద్యుత్ మోటర్ మరమ్మతులకు గురైంది. దీంతో నీటి సరఫరా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సమస్య తెలుసుకున్న మండల నాయకులు, సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదన రెడ్డి తన సొంత నిధులతో ఆదివారం ట్యాంకర్ ద్వారా గ్రామానికి నీరు సరఫరా చేశారు. ప్రజల నీటి అవసరాన్ని తీర్చడంతో గ్రామస్తులు మధుసూదన రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న భూపేష్‌రెడ్డి

ఘనంగా జాతర పీర్లు ఊరేగింపు

ప్రజాశక్తి - ముద్దనూరు

మంగపట్నం గ్రామంలో కమిటీ సభ్యులు పెనుగొండ బాబయ్య స్వామి జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో కొలువుదీరిన జాతర పీర్లను (స్వాముల వారిని) ఆదివారం ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో ప్రత్యేకప్రార్థనలు చేశారు. మంగపట్నంలో విశ్రాంత అధ్యాపకులు పుల్లారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కోలాటం, చెక్కభజన వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అల్లంగుండు, స్లో బైకు, కీలు గుర్రం ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి దాతలు బోడెద్దుల మల్లిఖార్జునరెడ్డి, కోడికండ్లపల్లి జగన్‌మోహన్ రెడ్డి, కోడికండ్లపల్లి హరినాథ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. స్వామి వారి లడ్డూ వేలంపాట నిర్వహించారు. శేఖర్ ఆచారి, పవిత్ర కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలిరెడ్డి, మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, క్రిష్ణంనాయుడు, రామాంజులరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


బి.మఠం : ఏటికి పోతున్న పీర్లు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం ప్రారంభమైన మొహరం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. మొహరం పర్వదినాన్ని ఆదివారం సోమిరెడ్డిపల్లి, గొల్లపల్లి, కొండువారి పల్లి, మద్దిరెడ్డిపల్లి, చుట్టూపక్కల గ్రామాల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. డైసోమ్ డైసోమ్ అంటూ పీర్లకు ఉగ్రం తెప్పించి ఊగేలా చేసి వైభవంగా జరుపుకున్నారు. సోమిరెడ్డిపల్లి మెయిన్

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి అక్కింతల ఓబాయపల్లి గ్రామం వద్ద ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రసాద్‌రెడ్డి అనే పాల వ్యాపారి మృతి చెందాడు. మృతుడిది పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామం. ప్రసాద్‌రెడ్డి పాల వ్యాపారం సాగిస్తూ కడపలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కడప నుంచి వల్లూరు మండలం గొల్ల ఓబాయ్‌పల్లిలో పాలు సేకరణ చేయడానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు ప్రసాద్‌రెడ్డి

అందుబాటులోలేని సామగ్రి

ప్రజాశక్తి - చాపాడు

చేతి పంపుల మరమ్మతులకు సంబంధించి సామగ్రి అందుబాటులో లేదు. ఈ పరిస్థితుల్లో ఏదైనా మరమ్మతు చేయాల్సి వస్తే ఇబ్బందులు తప్పవు. చాపాడు మండల పరిధిలో 15 సచివాలయాల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో 340 చేతి పంపులు ఉన్నాయి. వీటిలో 240 చేతి పంపులను ప్రజలు అధికంగా వినియోగిస్తున్నారు. వీటి మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రి మండల అభివృద్ధి కార్యాలయంలో అందుబాటులో లేదు. చేతి పంపులు రిపేరు వస్తే వాటిని వినియోగించుకునే అవకాశం లేకుండా పోతోంది. వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి కటకట ఏర్పడినప్పటికీ మండల పరిధిలో చేతి పంపులు అధికంగా ఉండడంతో చాలా వరకు నీటి సమస్య తలెత్తకుండా బయటపడ్డారు. ఒకటి రెండు గ్రామాలు మినహా మిగిలిన చోట్ల వేసవిలో సమస్య ఏర్పడలేదు. చియ్యపాడు గ్రామంలో అధిక నీటి సమస్య ఏర్పడడంతో పంచాయితీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. చాలా గ్రామాలలో సర్పంచులు తమ నిధులను వెచ్చించి చేతిపంపులకు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం మండల పరిషత్ నిధులతో అరకొరగా చేతిపంపుల సామగ్రిని కొనుగోలు చేస్తూ మరమ్మతులకు వినియోగిస్తున్నారు. గత వారంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ భరత్‌కుమార్ రెడ్డి సమస్యను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. నిధులు మంజూరు చేసి అవసరమైన చేతిపంపు సామగ్రిని అందుబాటులో ఉంచుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపిడిఒ కార్యాలయంలో చేతిపంపులకు సంబంధించిన సామగ్రి అందుబాటులో ఉంటే గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.


దెబ్బతిన్న చేతి పంపు సామగ్రిని కార్యాలయానికి తెచ్చిన ప్రజలు

కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి


కౌన్సెలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్‌ఐటిలో సోమవారం నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, కన్వీనర్ అమరేంద్ర సండ్రా తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లును పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర సండ్రాతో కలిసి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు సెంట్రల్ లైబ్రరీలో రెండు రోజులపాటు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు 24,25 తేదీల్లో ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రెండు క్యాంపస్‌లకు సంబంధించి 4 రోజులపాటు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకరావాలన్నారు. అదనపు సమాచారం కోసం ఆర్‌జెయుకెటి వైబ్‌సైట్ చూడాలని కోరారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి అధ్యాపకులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాల కోసం పాడిరైతు ఎదురుచూపు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పాడిరైతులు పశుగ్రాసం కొరత రాకుండా కాకి జొన్నలు రకానికి చెందిన గడ్డి విత్తనాలు సాగు చేస్తారు. అయితే వీటి కోసం పాడిరైతులకు ఎదురుచూపు తప్పడం లేదు. గతంలో జనవరి చివరికి పాడి రైతులకు గడ్డి విత్తనాలు సబ్సిడీ ధరతో మంజూరు కాలేదు. ఈ ఏడాది జులై మూడవ వారం గడుస్తున్నా వర్షం జాడ కనిపించలేదు. దీంతో ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. కనీసం పశువులకు పచ్చి గడ్డి సాగు చేసుకోవాలని రైతులు బావిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి 20రోజుల పాటు కెసి కెనాల్ కాలువలో నీరు ప్రవహిస్తూ ఉండేది. విత్తనాలు పంపిణీ చేసి ఉంటే సాగుకు నీటి కొరత కూడా ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం గడ్డి విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో అధిక ధరలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుండి వస్తున్న అభ్యర్థన మేరకు మండలానికి గడ్డి విత్తనాలు మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. చాలా మంది రైతులు పశుగ్రాసం సాగు చేస్తున్నారు. పెద్దగురువలూరు, చిన్న గురవలూరు, సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, కుచ్చుపాప గ్రామాల్లో గడ్డి సాగు చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి పాడి రైతుల కోసం గడ్డి విత్తనాలు మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.


చిన్నగురువలూరు పొలాల్లో రైతులు సాగు చేసిన పశుగ్రాసం

వేదవ్యాసుడు భారతీయ సమాజానికి ఆదిగురువు


వేద మహర్షి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

పజాశక్తి - వేంపల్లె

భగవాన్ వేదవ్యాస మహర్షి భారతీయ సమాజానికి ఆదిగురువని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసిరెడ్డి గురుపూర్ణిమ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు విశిష్ట స్థానం ఉందన్నారు. అట్టి గురు పరంపరకు ఆద్యుడు భగవాన్ వేదవ్యాస మహర్షి అని వివరించారు. కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ నేతలు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, వినయ్, బద్రి, రవి పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

సింహాద్రిపురం : మండలంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన సింహాద్రిపురం సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుర జాలలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో కొలహపురి మహాలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : గురు పౌర్ణమి పురస్కరించుకొని పులివెందుల పట్టణం పార్లపల్లి రోడ్డులో వెలసిన శ్రీశ్రీసాయినాథుని దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ అధ్యక్షుడు శ్రీరామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున మురళి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మాజీ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున, గుల్జార్ పాల్గొన్నారు.


ప్రత్యేకపూజలో వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

మానవత్వం చాటుకున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి


వృద్ధురాలిని ఆశ్రమ నిర్వాహకుడికి అప్పగిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎవరు ఎటు పోతే మనకెందుకులే అని అనుకునే ఈ రోజుల్లో.. ఎవరో తెలియని వృద్ధురాలి విషయంలో ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధురాలు ఆకలితో దీనస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆదివారం ఆమె ఆకలిని తీర్చారు. రెండు రోజులుగా అక్కడే ఉన్నట్లు పలువురు చెప్పడంతో ఆమె తరపు బంధువుల గురించి ఆరా తీశారు. ఎవరూ ఆమెను తీసుకెళ్లాడానికి ముందుకు రాకపోవడంతో తిప్పలూరు గ్రామంలో ఉండే ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ వృద్ధాశ్రమానికి ఆమెను ఎస్ఐ తన సిబ్బందితో తీసుకెళ్లారు. ఆమె బాధ్యతను ఆశ్రమ నిర్వాహకుడు ఎద్దుల నాగేంద్రకు అప్పజెప్పారు. మానవత్వం చాటుకున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డిని ప్రజలు ప్రశంసించారు. కార్యక్రమంలో సిబ్బంది జయంతి, మైజు, నాగేంద్ర పాల్గొన్నారు.


రోడ్లపై పారుతున్న వర్షపునీరు

మోస్తరు వర్షానికే రోడ్లపై చేరుతున్న నీరు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ 13వ వార్డు ప్రొద్దుటూరు రోడ్డులోని మానస హాస్పిటల్ వీధిలో చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఇటీవల కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి రోడ్డుపై వర్షపు నీరు చేరింది. ఈ సమస్య 15ఏళ్లుగా ఉందని, పలుమార్లు ఫిర్యాదు చేసినా తమను పట్టించుకున్న అధికారి, నాయకుడులేడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కేవలం చిన్నపాటి వర్షానికి పైతట్టు నుంచి వచ్చే మురుగునీరంతా ఇంటి ముందు నిలుస్తోందని, చాలా ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో అయినా మురుగు నుంచి మోక్షం వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తమ సమస్యను మీరైనా తీర్చండి ఎమ్మెల్యే గారూ అని ప్రజలు కోరుతున్నారు .

పెట్టుబడులు, పరిశ్రమలు అడ్డుకునేందుకు వైసిపి కుట్ర

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా అడ్డుకునేందుకు వైసిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు అని ఢిల్లీలో ధర్నా చేస్తా అనడం సిగ్గుచేటన్నారు. వినుకొండ సంఘటనపై వైసిపి నాయకులు మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు విడ్డూరంగా చూస్తున్నారన్నారు. ఒక దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను హింసించినప్పుడు, ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను హత్య చేసినప్పుడు, నంద్యాలలో ఒక ముస్లిం మైనారిటీ కుటుంబానికి చెందిన అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకున్నప్పుడు, నెల్లూరు జిల్లాలో బిజెపి మహిళపై కత్తితో దాడి చేసినప్పుడు, ప్రకాశం జిల్లాలో బీసీకి చెందిన బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య చేసినప్పుడు, పలనాడులో తెలుగుదేశం కార్యకర్త చంద్రయ్యను హత్య చేసినప్పుడు ఎందుకు మాట్లడలేదని ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలోనైనా వ్యక్తిగత కక్షలతో, భూతగాదాలతో, ఇతర విషయాల్లో ఘర్షణలు, హత్యలు సహజంగా జరుగుతుంటాయని తెలిపారు. ఇలాంటి విషయాలను కూడా వైసిపికి చెందిన సానుభూతిపరులని చెప్పుకుంటూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చూపించే ప్రయత్నం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న మంచి పేరుని చెడిపేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు జరిగిన సంఘటనలపై, 2019 నుంచి 2024 వరకు శాంతిభద్రతలపై పోలీస్ క్రైమ్ పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సూచనలివ్వాలని ఆయన కోరారు.


పొలాల్లో ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలు

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - పెద్దముడియం

వర్షాకాలం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఒరిగిన విద్యుత్ స్తంభాలతో హడలిపోతున్నారు. రైతులు, రైతు కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన వారిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. మండల పరిధిలోని ఎన్.కొట్టాలపల్లె రోడ్డులోని విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి వల్ల పొలాల్లో పని చేసే రైతులు, రైతు కూలీలకు ప్రమాదం పొంచి ఉంది. ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.


విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విశ్రాంతి ఉద్యో గులకు అభిలాష్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. పట్ట ణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో డాక్టర్ గురు అభిలాష్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కంటి జబ్బులతో బాధపడుతున్న పలువురికి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఆసుపత్రి టెక్నికల్ అసిస్టెంట్ భద్రకుమార్, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో రామతులశమ్మ 21వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన తన సతీమణి హరితతో కలిసి రామతులశమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 30 మంది విభిన్నప్రతిభావంతులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రారెడ్డి దంపతులను వికలాంగుల నెట్ వర్క్ సభ్యులు ఘనంగా సత్కరించారు. తన మాతృమూర్తి జ్ఞాపకార్థం చేయూతనందించిన డాక్టర్ రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు విభిన్నప్రతిభావంతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు గంగయ్య, సిద్ధారెడ్డి, సాయి, మహమ్మద్ వలి పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులు



జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 45 సంవత్సరాల తర్వాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఆనందోత్సాహాల నడుమ పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 1979లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత నాటి స్నేహితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు. స్థానిక రహదారుల భవనాల శాఖ అతిథిగృహంలో పూర్వ విద్యార్థులు సమావేశమై ముందుగా గురువులను సన్మానించారు. గురుపూర్ణిమ సందర్భంగా గురువులను సన్మానించడం పూర్వ జన్మసుకృతమని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. దివంగతులైన సహచరులను తలచుకుని వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకోవడంతోపాటు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల మధ్య నాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం భోజనానంతరం చదివిన తల్లి శెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. రెండు, మూడు రాష్ట్రాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆదివారం మండలానికి చెందిన టిడిపి నాయకులు ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జ్ఞాపికకు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా నాయకులు కలిసి విగ్రహ ప్రతిమ అందజేశారు. కార్యక్రమంలో మండలం టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు యాదవ్, ఐ టిడిపి పాపన మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.